క్లుప్తంగా

ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు



తుక్కాపూర్‌లో బాల్‌రాజుకు చెక్కు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని తుక్కాపూర్‌లో బోయిని బాల్‌రాజుకు మంజూరైన రూ.60 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ కుటుంబానికి అందుతున్నాయన్నారు. ఎల్లారెడ్డిపేట, చందాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు గోవర్ధన్, నర్సింహులు, ఎంపీటీసీ స్వామి, మండల కో ఆప్షన్ సభ్యుడు కలీముద్దీన్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోచయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు కృష్ణమూర్తి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ కాసం కృష్ణమూర్తి వర్ధంతి కొమురవెల్లి, చేర్యాలలో సీపీఎం నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తన బాల్యం నుంచే నిజాం రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కృష్ణమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో చేర్యాల సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

కోహెడ రూరల్(హుస్నాబాద్): పట్టణాలకు దీటుగా గ్రామాలకు అభివృద్ధి చేయడమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ఎంపీపీ కొక్కుల కీర్తిసురేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ నాగరాజు శ్యామలదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వర్ష బాధితులను ఆదుకోవాలి

కొమురవెల్లి(సిద్దిపేట): భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వకుళాభరణం నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు బుడిగే గురువయ్యగౌడ్‌తో కలసి వర్షాలకు నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దానాల్లో విద్యాదానం గొప్పది

మర్కూక్(గజ్వేల్): బీఆర్‌ఎస్ నేత, వంటిమామిడి మార్కెట్ డైరెక్టర్ రాందాస్ గౌడ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చేబర్తిలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం పుస్తకాలను అందజేశారు. దానాల్లో విద్యాదానం గొప్పదన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

ములుగు(గజ్వేల్): తల్లిపాల వారోత్సవాలను ములుగులో నిర్వహించారు. మంగళవారం మండలంలోని క్షీరసాగర్ గ్రామహంస హోమియోపతి కళాశాల, పరిశోధన కేంద్రం విద్యార్థులు ర్యాలీ తీశారు.

బెజ్జంకి(సిద్దిపేట): తల్లి పాల వారోత్సవాలను బెజ్జంకి అంగనాడి–2కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు.

మొక్కలను సంరక్షించాలి

మద్దూరు(హుస్నాబాద్): ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ బద్దిపడిగె లలిత కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాయపల్లిలో హరితహారంలో మొక్కలను పంపిణీ చేశారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హుస్నాబాద్ ఎస్ఐలు దామోదర్, సాయికృష్ణ ఈత మొక్కలు నాటారు.

హుస్నాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రజలు మొక్కలు నాటి వాటిని రక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. మంగళవారం పట్టణంలో మొక్కలు పంపిణీ చేశారు.

అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తాం

తిగుల్ మండల సాధన సమితి సభ్యులు



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌ను నూతనంగా మండలంగా ఏర్పాటు చేయాలని 2022 ఆగస్టు 1వ తేదీన మండల సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు ప్రారంభించారు. మంగళవారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల సాధన సమితి సభ్యుడు, సర్పంచ్ భానుప్రకాశ్ రావు మాట్లాడారు. తిగుల్ గ్రామం మండలంలోనే పెద్ద గ్రామమని మండల ఏర్పాటుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. మండలం ఏర్పాటుచేయాలని గత ఆగస్టు నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. మండలంగా ప్రకటించకుంటే రానున్న సాధారణ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. రిలే నిరహార దీక్షలకు బీజేపీ రాష్ట్ర నాయకులు గురవారెడ్డి, ప్రసాద్‌రావు, రాంరెడ్డి, రాములు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల సాధన సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి



నీటిని తొలగిస్తున్న చైర్‌పర్సన్ వనిత, కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: వర్షాల నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి సూచించారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో డ్రై డే సందర్భంగా మంగళవారం ఇళ్లలోని నీటిని తొలగించి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయన్నారు. అనంతరం 17,15 వార్డులలో మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ గణేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే 71 పోస్టులు

దుబ్బాకటౌన్: గత శాసనసభ సమావేశాల్లో దుబ్బాక వంద పడకల ఆసుపత్రికి సిబ్బందిని కేటాయించాలని గళమెత్తడంతోనే 71 పోస్టులు మంజూరయ్యాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం దుబ్బాక ఆసుపత్రిలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో నూతన బస్టాండ్

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణీకులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్‌లో ఉన్న తాత్కాలిక బస్టాండ్‌ను తొలగించి నూతన బస్టాండ్ నిర్మిస్తామన్నారు. నిర్మాణం త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామన్నారు.

ఆగస్టు 18 నుంచి యుద్ధభేరి



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక: మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్ రెడ్డిపై దుబ్బాక నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం దుబ్బాక కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కలుషిత నీరుతాగి ఓ వ్యక్తి మృతి చెందితే అతడి కుటుంబాన్ని పరామర్శించని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి పాలాభిషేకాలు అవసరమా అని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎంపీపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రఘునందన్ రావు దుబ్బాకకు చేసిందేమి లేదని విమర్శించారు. ఆగష్టు 18 వ తేదీ నుంచి ఎంపీ, బీఆర్‌ఎస్ నాయకులపై 60 రోజుల పాటు యుద్ధభేరి చేపడుతున్నామన్నారు.

గుంట భూమి ఉన్నా అర్హులు

సిద్దిపేటరూరల్: నూతనంగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమణి అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల పరిధి మల్యాల గ్రామంలో పోతిరెడ్డి ఆంజనేయులు చనిపోవడంతో మృతుడి కుటుంబం వివరాలు సేకరించారు. గుంట భూమి ఉన్న రైతు బీమాకి అర్హులన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి దూళ్మిట్ట మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందించారు.

ఎంపీ కృషితోనే 71 పోస్టులు మంజూరు

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రికి 71 పోస్టులు మంజూరు చేస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటే ఎమ్మెల్యే రఘునందన్‌రావు తానే మంజూరు చేయించానంటూ చెప్పుకోవడం సిగ్గుచేటని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి మండిపడ్డారు. దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి ఎంపీ ప్రభాకర్ రెడ్డి కృషితోనే 71 పోస్టులు మంజూరయ్యాయన్నారు. దీంతో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. కేంద్రం నుంచి రూపాయి తీసుకురాని ఎమ్మెల్యే తన చిత్రపటానికి పాలాభిషేకాలు చేయించుకోవడం సిగ్గుచేటన్నారు.

టెండర్ల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రెండేళ్ల కాలపరిమితికి స్టేషనరీ, ప్రింటింగ్ మెటీరియల్ సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో స్టేషనరీ, ప్రింటింగ్ మెటీరియల్ సరఫరా చేసేందుకు ఆసక్తిగల వారు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పేరుపై రూ.2 వేలతో బ్యాంక్ డీడీ తీసి దరఖాస్తుకు జతచేసి సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈనెల 3వ తేదీలోపు అందజేయాలన్నారు. 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు టెండర్ ఓపెన్ చేసి కేటాయిస్తామన్నారు.

ఆర్టీసీ మరింత బలోపేతం



మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కావడంతో ప్రజారవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుందన్నారు.

సిద్దిపేటకమాన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ ఉద్యోగుల సేవ మరిచిపోలేమని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు సీఎం ప్రకటించడంపై సిద్దిపేట ఆర్టీసీ డిపో ఎదుట సిబ్బంది మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

దుబ్బాక: అన్ని రంగాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి , ఎంపీపీ పుష్పలత కిషన్ రెడ్డి అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో మంగళవారం ఆర్టీసీ కార్మికులు దుబ్బాక బస్టాండ్‌లో సంబురాలు జరుపుకున్నారు.

పాడె మోసిన చైర్మన్లు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పత్తిరి రాజయ్య భార్య రామవ్వ మంగళవారం మృతి చెందింది. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియల్లో పాల్గొన్న చైర్మన్లు పాడె మోశారు.

అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు

మర్కూక్(గజ్వేల్): బీజేపీ అధికారంలోకి రాగానే అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని పార్టీ మాజీ ఎంపీ, రాష్ట్ర నాయకుడు జితేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వర్షాలకు నష్టపోయిన బాధితులను పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోని రాగానే అందజేస్తామన్నారు.

విలీనంపై ఏకపక్ష నిర్ణయం సరికాదు

బీజేపీ నేత బొమ్మ శ్రీరాంచక్రవర్తి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి

హుస్నాబాద్: అశాస్త్రీయంగా, ప్రజల మనోభావాలకు విరుద్ధంగా పలు గ్రామాలను హుస్నాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఎమ్మెల్యే సతీశ్ కుమార్ కలెక్టర్‌కు లేఖ రాయడం ఏకపక్ష నిర్ణయని, గ్రామాల విలీనంపై రెఫరెండం పెట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను, స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పోతారం(ఎస్), గాంధీనగర్, పందిల్ల గ్రామాలను మున్సిపాలిటిలో కలపాలని, చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి గ్రామాన్ని హుస్నాబాద్‌లో విలీనం చేయాలనడం సరికాదన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలను బలవంతంగా సిద్దిపేటలో కలిపి నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేశారని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ వేణుగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, కోమటి స్వర్ణలత, పందిల్ల ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ స్కీం వర్తింపచేయాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న యూనియన్ నాయకులు

హుస్నాబాద్: పెన్షన్ స్కీం వర్తింపచేయాలని డిమాండ్ ఎల్ఐసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఏఐఐఈఏ యూనియన్ క్లాస్ ఫెడరేషన్ సంఘాల ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కుటుంబ పెన్షన్ 30 శాతం, ఎన్‌పీఎస్ పథకాల్లో యాజమాన్యం వాటా 14 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ 1995 పెన్షన్ స్కీం ఉద్యోగులకు వర్తింపజేయాలన్నారు. మేనేజ్‌మెంట్ కాంట్రిబ్యూషన్ 10 నుంచి 14 శాతానికి పెంచాలని నినాదాలు చేశారు.

స్టీల్ గ్లాస్‌ల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీచర్ విజయశాంతి సహకారంతో మంగళవారం స్టీల్ గ్లాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్లం, శంకర్, లక్ష్మి పాల్గొన్నారు. సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు.

సర్వేయర్‌తో హద్దులు నిర్ణయిస్తాం

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీలోని అంగడి బజారు నుంచి ఉన్న ఆకునూరు రోడ్డును విస్తరించనున్నారు. దీంతో రోడ్డు విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులతో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి మంగళవారం అధికారులు, కౌన్సిలర్లు, రోడ్డు విస్తరణ బాధితులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాధితులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయే వారంతా మాల, మాదిగ సామాజిక వర్గాలకు చెందిన వారమని, ఇళ్లు కోల్పోయేవారికి ప్లాటు, ఇల్లు మంజూరు చేయాలని మున్సిపల్ పాలకవర్గాన్ని కోరారు. అనంతరం సంబడికుంట ప్రాంతంలోని ఖాళీ స్థలంలో ఇళ్లు, స్థలాలు కేటాయించాలని తహసీల్దార్ ఆరిఫాకు వినతి పత్రం అందజేశారు. కుంటను పరిశీలించి హద్దులు నిర్ణయిస్తామని తహసీల్దార్ తెలిపినట్లు బాధితులు తెలిపారు.

కేబినెట్ నిర్ణయంపై హర్షం

సిద్దిపేటజోన్: బీడీ టేకేదార్లకు ఆసరా తరహా జీవన భృతి ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై టేకేదార్లు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

దుబ్బాక: టేకేదారులకు ఆసరా పెన్షన్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో టేకేదారులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

కొండపాక(గజ్వేల్): బీడీ టేకేదారులకు ప్రభుత్వం జీవన భృతి ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధి దుద్దెడలోని బీడీ కంపెనీ వద్ద బీఆర్‌టీయూ బీడీ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

బాధితులకు పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): భారీ వర్షాలకు మండలంలోని లింగారెడ్డిపల్లి, గొల్లపల్లి, మునిగడప గ్రామాల్లో ఇళ్లు కూలి నష్టపోయిన బాధితులను మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

రూ.500లకే గ్యాస్

అక్కన్నపేట(హుస్నాబాద్): కాంగ్రెస్ అధికారంలో రాగానే గ్యాస్ సిలిండ్ ధర రూ.500లకే ఇస్తామని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంచినీళ్లబండలో పల్లెపల్లెకు ప్రవీణ్ అన్న, గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రకృతికి గిరిజనుల పూజలు



బోనం తీసుకెళ్తున్న ఉపసర్పంచ్ గుగులోతు శారద

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని జిల్లెలగడ్డలో గిరిజనులు శీత్లా భవానీ ఉత్సవాలను మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ లకావత్ మానస మాట్లాడుతూ అటవీ సంరక్షణ కోసమే అడవి బిడ్డలు కృషి చేస్తారని, అందులో భాగంగానే పంటల దిగుబడులు రావాలని కోరుతూ ప్రకృతికి పూజలు చేయడం గిరిజనుల ఆచారమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లావుడ్య స్వరూప, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనులు పవిత్రంగా జరుపుకునే తొలి పండగ శీత్లా పండగ. కలరా వంటి మహమ్మారులు ప్రబలకుండా భవానీ మాత కాపాడుతుందని గిరిజనుల నమ్మకం. దీంతో శీత్లా భవానీ పండగను ఘనంగా జరుపుకుంటారు. మంగళవారం మండలంలోని మల్‌చెర్వుతండా, గండిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పలుతండాల్లో శీత్లా భవానీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య మల్లేశ్, ఉప సర్పంచ్ గుగులోతు శారద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు**

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్ఐలు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట టూటౌన్ ఎస్ఐగా శ్రీనివాస్, బెజ్జంకి ఎస్ఐగా నరేందర్‌రెడ్డి, చిన్నకోడూర్ ఎస్ఐగా సుభాష్‌గౌడ్, జగదేవ్‌పూర్ ఎస్ఐగా చంద్రమోహన్, రాజగోపాల్‌పేట ఎస్ఐగా మోహన్‌రెడ్డి, కోహెడ ఎస్ఐగా తిరుపతి, మర్కూక్ ఎస్ఐగా శంకర్, కొమురవెల్లి ఎస్ఐగా నాగరాజు, ఎస్‌బి ఎస్ఐ కృష్ణ బాధ్యతలు చేపట్టారు. వారంతా సీపీ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అలాగే పోలీసు కమిషనరేట్‌లో నూతన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా రాజేష్ బాధ్యతలు చేపట్టారు.

◆ **సివిల్ రైట్స్ డే నిర్వహించాలి**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని సీపీఐ మండల కమిటీ సభ్యుడు కత్తుల భాస్కర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు తహసీల్దార్ ఆరిఫాకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై సానుకులంగా స్పందించిన తహసీల్దార్ ఈనెల 30వ తేదీన పోతిరెడ్డిపల్లిలో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తామన్నారు.

◆ **మృతుడి కుటుంబానికి పరామర్శ**

జగదేవ్‌పూర్(గజ్వేల్): అనారోగ్యంతో మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌కు చెందిన దోమ జహంగీర్(40) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి**

తొగుట(దుబ్బాక): రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీలోగా రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలని, ఈ పథకానికి 18 నుంచి 59 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అకస్మాత్తుగా జరిగే ప్రమాదాల్లో రైతులు మరణిస్తే వారంలో బాధితుడి కుటుంబానికి బీమా సొమ్ము అందుతుందన్నారు.

◆ **మంత్రికి కృతజ్ఞతలు**

కోహెడ(హుస్నాబాద్): కోహెడకు 108 అంబులెన్స్ కేటాయింపుపై మంత్రి హరీశ్‌రావుకు సర్పంచ్ పెరియాల నవ్య, కోహెడ ప్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 25వ తేదీన కోహెడకు వచ్చినప్పుడు మంత్రికి అంబులెన్స్ మంజూరు చేయాలని విన్నవించినట్లు చెప్పారు. మంత్రి స్పందించి అంబులెన్స్ మంజూరు చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు.

◆ **ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై అవగాహన**

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని చిట్యాల, తాడూరి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాట్లపై మంగళవారం ప్రజాప్రతినిధులు, యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనగామ ఆర్డీఓ కార్యాలయ నాయబ్ తహసీల్దార్ దయానంద్, ఎంపీటీసీ సులోచన, సహాయకుడు శ్రీధర్, బీఎల్‌ఓలు శ్రీనివాస్, మేఘమాల, జంబియా రాజు పాల్గొన్నారు.

◆ **చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు పోరాడదాం**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు రాజకీయాలకతీతంగా పోరాడాలని జేఏసీ మండల కన్వీనర్ బొమ్మగోని అంజయ్య గౌడ్ పిలుపు నిచ్చారు. మంగళవారం కడవేర్గు గ్రామంలో నిర్వహించిన సమావేశానికి హాజరై మట్లాడారు. ఈనెల 4వ తేదీన చేర్యాల నుంచి సిద్దిపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించాలని, కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కడవేర్గు గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కన్వీనర్‌గా బాపురాజు, కో కన్వీనర్లుగా మర్యాల సత్తయ్య, చల్లా బాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

◆ **స్వచ్ఛ సిద్దిపేట సాధిద్దాం**

సిద్దిపేటజోన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛ సిద్దిపేట సాధిద్దామని మునిసిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ అన్నారు. మంగళవారం 12 వార్డులో నడకతో చెత్త సేకరణ నిర్వహించారు. ప్రజలకు తడి, పొడి, హానికర చెత్త విభజనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు శ్రీనివాస్ యాదవ్, విఠోబ, సురేశ్, లక్ష్మణ్, ఎల్లం, రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

◆ **అనుచరుల కోసమే పరిపాలన**

హుస్నాబాద్: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని కొండాపూర్ గ్రామం హుస్నాబాద్‌కు 4 కిలో మీటర్ల దూరం ఉందని, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఆ గ్రామాన్ని హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఎందుకు విలీనం చేయడం లేదని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి ప్రశ్నించారు. పరిపాలన ప్రజల కోసం కాదని, అనుచరుల కోసమేనని విమర్శించారు.

◆ **గుంతల రోడ్డుకు మరమ్మతు**

రాయపోలు(దుబ్బాక): గుంతలమయమైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేశారు. గుంతల రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిపడుతున్నామని మండలంలోని వడ్డేపల్లి గ్రామస్తులు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి సొంత నిధులతో తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. మంగళవారం రోడ్డుకు మరమ్మతు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

◆ **ప్రజలకు నేత్రపరీక్షలు**

సిద్దిపేటజోన్: కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ అన్నారు. మంగళవారం బ్రాహ్మణ పరిషత్‌లో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు 9,10,11,12,13 వార్డుల ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ **కవయిత్రికి ఎమ్మెల్యే పరామర్శ**

దుబ్బాకటౌన్: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన కవయిత్రి ఎర్రగుంట సుజాతప్రసాద్ చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు మంగళవారం ఆమెను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

◆ **తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు**

బెజ్జంకి(సిద్దిపేట): సామాజిక మాధ్యమాల్లో సర్వేల పేరిట చేస్తున్న తప్పుడు ప్రచారాలను నియోజకవర్గ ప్రజలు నమ్మొద్దని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆరెపల్లి మోహన్ మంగళవారం విజ్ఞప్తి చేశారు. కొంత మంది తప్పుడు ప్రచారానికి దిగారని, ప్రజలకు ఫోన్ చేస్తూ బీజేపీ మానకొండూరు అభ్యర్థిగా చిత్రికరించే విధంగా సర్వేలు చేస్తున్నారన్నారు. ఇందులో నిజం లేదన్నారు. దీనిపై సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశిస్తే మానకొండూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, లేదంటే పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

◆ **రక్తదానం చేసిన కానిస్టేబుళ్లు**

సిద్దిపేటకమాన్: చికిత్స పొందుతున్న ఇద్దరు మహిళలకు కానిస్టేబుళ్లు రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు సిద్దిపేట వన్‌టౌన్ కానిస్టేబుల్ శరత్, అలాగే గజ్వేల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో మహిళకు గజ్వేల్ ఏసీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కరుణాకర్ రక్తదానం చేశారు.

◆ **ప్రజలను పట్టించుకోకుండా సమావేశాలా?**

గజ్వేల్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికొదిలి పాలన సాగిస్తోందని, వర్షాలతో ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మహారాష్ట్రలో సీఎం కేసీఆర్ సమావేశం పెట్టడమేంటని మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి మండిపడ్డారు. ఇటీవల మృతి చెందిన పలువురు బీజేపీ నాయకుల కుటుంబాలను పరామర్శించేందుకు మంగళవారం గజ్వేల్‌లో పర్యటించారు. ప్రజలను పట్టించుకోకుండా సీఎం కేసీఆర్ మహారాష్ట్రలో బహిరంగ సభలు పెట్టడమేమిటన్నారు. ప్రాజెక్టుల పేరుతో రైతుల నుంచి భూములు తీసుకొని వారి సమస్యలను పరిష్కరించకుండా మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయశ్రీ, ఐటీసెల్ రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ మన్నె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.